

జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి సస్పెన్షన్

రంగారెడ్డి అర్బన్, జూలై 10 : జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తిపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగంపై ఆమెను సస్పెండ్ చేస్తూ మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ పార్టీల నుంచి డబ్బుల వసూలు, ఫర్నిచర్, అల్మారా కొనుగోళ్ల వ్యవహారంలో ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు. ఆమె స్థానంలో హైదరాబాద్ డీఎఫ్‌వో చరితకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు.



గోల్డ్ మెడలిస్ట్‌కు ఘన స్వాగతం

- ఏషియా సౌత్ ఆఫ్రికన్ పసిఫిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సుకన్యబాయికి స్వర్ణ పతకం
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అభిమానుల గ్రాండ్ వెల్‌కమ్

శంషాబాద్ రూరల్, జూలై 10 : పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారం పతకం సాధించి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తేజావత్ సుకన్యబాయికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఈ నెల 7న సౌత్ ఆఫ్రికాలో జరిగిన ఏషియా సౌత్ ఆఫ్రికన్ పసిఫిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన తేజావత్ సుకన్యబాయి బంగారం పతకం సాధించారు. 76 కిలోల విభాగంలో పోటీపడి బంగారు పతకం సాధించారు. బుధవారం సౌత్ ఆఫ్రికా నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఆమెకు తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అభిమానులు బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుకన్యబాయి విలేకరులతో మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొత్తం 60 దేశాలు పాల్గొన్నట్లు తెలిపారు. భారత్ తరఫున మున్ముందు మరెన్నో పతకాలను సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి సహాయ సహకారాలతో ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు(గురువారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తానని సుకన్యబాయి తెలిపారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

తలకొండపల్లి, జూలై 10: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని డీఈవో సుశీందర్‌రావు సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. తలకొండపల్లి మండలం చంద్రధన, వెల్జాల పాఠశాలలను, మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం డీఈవో తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌లను క్రమం తప్పకుండా బోధించాలన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో బాలికలు, బాలుర పాఠశాలలు ఒక కాంపౌండ్ వాల్‌లో ఉన్నప్పుడు ఉమ్మడి టైంటేబుల్ తయారు చేసుకొని బోధన జరపాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సర్దార్‌నాయక్, కడ్తాల, ఆమనగల్లు నోడల్ అధికారులు జంగయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

చేయూత ఏదీ?

పెన్షన్ కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు

పెన్షన్ల కోసం అభాగ్యులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పేద వర్గాలకు చెందిన అనేకమంది ఇప్పటికే పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారు కొందరైతే, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్లయ్ చేసుకున్న వారు మరి కొందరు ఉన్నారు. వీరంతా తమకు పెన్షన్లు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు తప్ప వారి ఆశలు తీరే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే పింఛన్ల డబ్బులను పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటికీ అది నెరవేరలేదు. దీంతో ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారు కూడా పెరిగే పింఛన్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. తమ ఎదురు చూపులు ఎప్పుడు ఫలిస్తాయోనని ఉత్కంఠతో ఉన్నారు.

జిల్లాలో ప్రస్తుతం అందజేస్తున్న పింఛన్లు

రకం	లబ్ధిదారులు
వృద్ధాప్య	78,543
వితంతు	83,693
వికలాంగులు	27,178
కల్లుగీత కార్మికులు	2,367
చేనేత కార్మికులు	821
బీడీ కార్మికులు	14
ఒంటరి మహిళ	6,448
ఫైలేరియా	57
డయాలసిస్	342

ప్రతినెలా మంజూరు రూ.49.44కోట్లు

- అర్హులైన వారికి అందని పెన్షన్లు
- పెండింగ్‌లో 18వేలకు పైగా దరఖాస్తుదారులు
- పెన్షన్ల పెంపుపై లబ్ధిదారుల ఆశలు
- ఇప్పటికే ప్రతినెలా రూ.49.44 కోట్ల పంపిణీ





(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

చేయూత పెన్షన్లు కోసం జిల్లాలో వేలాది మంది ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్లపై కాంగ్రెస్ సర్కార్ ఇంతవరకు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో పథకం పొందేందుకు అన్ని అర్హతలూ ఉన్న అనేక మంది చేయూత పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. వీరి సంఖ్య జిల్లాలో సుమారు 15వేలకు పైగా ఉంటుందని అంచనా. గత ప్రభుత్వ హయాంలో సుమారు 3,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇటీవల ఆరు గ్యారెంటీల పథకాలకు సంబంధించి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించగా దాదాపు 15వేలకు పైగా చేయూత కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. వీరిలో అనేకమంది కొన్నేళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే వీరితో పాటు ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులు కూడా పెన్షన్ల పెంపుపై ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో పెన్షన్లు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీ ఇంకా ఎప్పుడు నెరవేరుస్తారని ప్రతిపక్షాలు కూడా గట్టిగానే ప్రశ్నిస్తున్నాయి. చనిపోయిన వారికి పెన్షన్లు వెంటనే తొలగిస్తున్న ప్రభుత్వాలు అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేసేందుకు ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నాయి. దీంతో అర్హులైన పేదలకు ఈ పథకం సకాలంలో అందుబాటులో రావడం లేదు. కొత్త ప్రభుత్వం ఆసరా పేరుతో ఇస్తున్న పెన్షన్ పథకాన్ని చేయూతగా మారుస్తున్నట్లు మాత్రం ప్రకటించింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,99,064 మందికి ప్రభుత్వం ప్రతినెలా పింఛన్లు అందజేస్తోంది. ఇందు కోసం ప్ర నెలా రూ. 49.44కోట్లు మంజూరు చేస్తోంది. ఇందులో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ వారికి ప్రతి నెలా రూ.2,016 చొప్పున పెన్షన్ అందజేస్తుండగా వికలాంగులకు ప్రతి నెలా రూ.4,016 పెన్షన్ అందజేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెన్షన్లు పెంచుతామని ప్రకటించింది. ఎన్నికల హామీల్లో భాగంగా వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ వారికి ప్రతి నెలా రూ.4వేలు, వికలాంగులకు ప్రతినెలా రూ. 6వేలు ఇస్తామని వెల్లడించింది. ఈ మేరకు ఇటీవల కొత్తగా దరఖాస్తులు కూడా స్వీకరించింది. అయితే ఇంతవరకు అతీగతీ లేదు. గత ప్రభుత్వం కూడా కొత్తగా పెన్షన్లు ఇవ్వకపోడంతో వేలాది మంది అర్హులు ఆసరా పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం పెన్షన్‌దారుల నిర్ణీత వయసును కూడా 57 ఏళ్లకు తగ్గించింది. ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది. అయితే ఇంతవరకు వీరికి పెన్షన్లు ఇవ్వలేదు. ఇపుడు ఇలా అర్హత ఉండి పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వారు వేలాదిగా ఉన్నారు.



టమాట సాగుకు మొగ్గు

యాచారం మండలంలోని వివిధ గ్రామాలలో మెట్ట పొలాల్లో రైతులు విరివిగా టమాట నారు నాటుతున్నారు. రెండు రోజుల నుంచి అర్ధరాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో మెట్ట పొలాలు దున్నుకున్న రైతులు టమాట సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో టమాటాకు మంచి ధర రావడంతో రైతులు ఆ పంటను సాగు చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మున్ముందు బాగా వర్షాలు కురిస్తే టమాట దిగుబడి బాగా వస్తుందని, దీంతో లాభాలు కూడా భారీగానే ఉంటాయనే ఆశతో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు.

- యాచారం, జూలై 10

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్
- చన్వల్లిలో శానిటేషన్ చేయించిన వైద్యసిబ్బంది

చేవెళ్ల, జూలై 10 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ తెలిపారు. డెంగీ తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కుర్వ మనీశ్వర్ మృతిపై జిల్లా వైద్యాధికారులు స్పందించారు. బుధవారం చేవెళ్ల మండలం చన్వల్లి గ్రామంలో వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. మృతి చెందిన బాలుడి ఇంటి ఆవరణ, పరిసరాలతో పాటు, చుట్టుపక్కల గ్రామాల్లో సైతం శానిటేషన్ చేయించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగీతో బాలుడు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ఫీవర్ కేసులు తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే చేయడం ద్వారా ఏడుగురికి జ్వరం ఉన్నట్లు గుర్తించామన్నారు. గ్రామంలో వైద్యక్యాంపు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. వేడిచేసి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు. నీటి గుంతల్లో నీటిని నిలవకుండా చూసుకోవాలన్నారు. ఆర్ఎంపీ వైద్యులు వారి స్థాయికి మించి వైద్యం చేయకూడదని హెచ్చరించారు. జ్వరంలో రోగులు రాత్రి పూట ఆస్పత్రికి వచ్చినా చేవెళ్ల ప్రభుత్వ ఆసుప్రతిలో అడ్మిట్ చేసుకోవాలని ఆసుపత్రి ఇన్‌చార్జి సోమశేఖర్‌కు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ డాక్టర్ రఘుబాబు, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, సుదర్శన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చన్వల్లిలో శానిటేషన్ చేయిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్

రేపు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

- హాజరు కానున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించిన పోలీసులు, బీజేపీ నేతలు

రంగారెడ్డి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి) : ఈనెల 12న(శుక్రవారం) బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పార్టీ నేతలు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారు. 2029లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారమే లక్ష్యంగా సమావేశాన్ని నిర్వహించనున్నారు. మల్లిక కన్వెన్షన్ హాల్లో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా బుధవారం స్థాని ఏసీపీ కేఎస్‌రావుతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కొప్పు భాషా, డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్, అంజన్‌కుమార్‌గౌడ్, మల్లారెడ్డి, వై. శ్రీధర్, జక్కా రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, పగడా శ్రీశైలం, ఉడుత అశోక్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.



మల్లిక కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు, బీజేపీ నేతలు

మత్తెక్కించే పాటలు.. అర్ధనగ్న నృత్యాలు!

- విచ్చలవిడిగా మందు, విందులతో మజా
- ఆర్ధరాత్రి అశ్లీలానికి కేరాఫ్‌గా ఫాంహౌస్‌లు
- అక్రమ సంపాదనే ధ్యేయంగా రేవ్, ముజ్రా పార్టీలు
- రోజు రోజుకు పెరుగుతున్న కల్చర్
- వరుసగా దాడులతో బయట పడుతున్న తతంగం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 10 : ఉమ్మడి జిల్లాలోని ఫాంహౌస్‌లు అశ్లీల నృత్యాలకు అడ్డాగా మారాయి. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, వికారాబాద్ జిల్లాలోని పూడూరు మండలాల్లో అత్యధికంగా ఫాంహౌస్‌లు ఉన్నాయి. వీటిలో రేవ్, ముజ్రా పార్టీల కల్చర్ రోజు రోజుకు పెరిగి పోతోంది. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా అశ్లీల నృత్యాల కల్చర్ మాత్రం మారడం లేదు. మొయినాబాద్ మండలంలోని ఓ ఫాంహౌస్‌లో సోమవారం రాత్రి 12మంది అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలతో ముజ్రా పార్టీ జరిగింది. అర్ధనగ్న డ్యాన్స్‌లు చేస్తున్న క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు రైడ్ చేసి పార్టీని భగ్నం చేసిన విషయం విదితమే. ఇలా తరచూ ముజ్రా, రేవ్ పార్టీలు సర్వసాధారణమయ్యాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఫాంహౌస్‌ల యజమానులు, వర్కర్లపై కేసులు నమోదు చేయడమే కాకుండా అరెస్టు చేస్తున్నారు. పోలీసులు వరుస దాడులు చేయడంతో వాటిల్లో జరుగుతున్న తతంగాలు బయటపడుతున్నాయి. డీజే సౌండ్లు, గంజాయి, డ్రగ్స్, మద్యం తాగేందుకు స్వేచ్ఛ లేదని నగర శివారులోని ఫాంహౌస్‌లకు వెళ్తున్నారు. ఇవి నగర శివారులో ఉండడం, పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో చాలామంది వీటిల్లో వేడుకలు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. నగరంలో పార్టీ చేసుకోవాలంటే చాలా ఆంక్షలు ఎదురవుతున్నాయి. సౌండ్ పెట్టకూడదు, నిర్ణీత సమయం దాటిన తర్వాత అనుమతించరు, మద్యం తదితరాలపై ఆంక్షలు ఉంటాయి. వీటి నుంచి తప్పించుకుని ఎంజాయ్ చేయాలంటే ఫాంహౌస్‌లే బెటరని పలువురు భావిస్తున్నారు. దీంతో చాలామంది చాలా రోజుల నుంచి ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకుని పార్టీలు చేసుకుంటున్నారు. ఇక్కడ పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో పెద్దపెద్దగా సౌండ్లు పెట్టుకుని ఎంజాయి చేస్తున్నారు. తెల్లవారుజాము వరకు మద్యం తాగుతున్నా అడిగేవారు లేక పోవడంతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సంస్కృతి ఎక్కువ కావడంతో కొంత కాలం నుంచి ఫాంహౌస్‌లపై పోలీసులు నిఘా పెట్టారు. ముఖ్యంగా వీకెండ్ సమయంలో పోలీసులు దాడులు చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని అరెస్టు చేస్తున్నారు. అర్ధనగ్న నృత్యాలకు ఫాంహౌస్‌లు కేరాఫ్‌గా మారాయి. చాలామంది ఫాంహౌస్‌లను ఏర్పాటు చేసి దానిలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీంతో పోలీసులు వరుసగా దాడులు చేస్తున్నారు. ఫాంహౌస్‌ల్లో మద్యం సరఫరా చేసే అనుమతులు లేకున్నా చాలామంది నిబంధనలు పాటించడంలేదు. కొన్ని ఫాంహౌస్‌ల్లో వ్యభిచారం కూడా నిర్వహిస్తున్నట్లు పోలీసుల దాడుల్లో బయటపడినట్లు తెలిసింది. వాటిని వ్యాపార సముదాయాలుగా మార్చి మద్యం, హుక్కా తదితరాలను సరఫరా చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ఇలాంటి ఫాంహౌస్‌లపై పోలీసులు మరింత దృష్టి నిలపాలని పలువురు కోరుతున్నారు.



ముజ్రా పార్టీ జరిగింది ఈ ఫాంహౌస్‌లోనే

చేవెళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

చేవెళ్ల, జూలై 10 : చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కోరారు. బుధవారం రాత్రి సచివాలయంలో రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతో పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రేవంత్‌రెడ్డికి బొకే అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కాంగ్రెస్ రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి

వికారాబాద్, జూలై 10: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి అన్నారు. బుధవారం వికారాబాద్ కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మారుతి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకు కట్టుబడి ఉంటే ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల పంటల రుణమాఫీని ఏకకాలంలో చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా రెండు పంటలకు రూ. 15,000 ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు రూ. 15వేలు, అలాగే వ్యవసాయ కూలీలకు 12వేలు ఇవ్వాలని అన్నారు. ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేసి రైతులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరారు. రైతు భరోసా అమలులో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతు భరోసా ఇవ్వాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని, రైతులకు న్యాయం చేయలేని, చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జిల్లా, మండల కిసాన్ మోర్చా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి పనిచేస్తాం


ముదిరాజ్ సంఘాలతో మాట్లాడుతున్న మత్స్య శాఖ అధికారి సౌజన్య

మోమిన్‌పేట్, జూలై 10: మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పిన్నమోని శ్రీధర్, మత్స్యశాఖ అధికారి సౌజన్య అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లోని కా స్లబాద్ నంది వాగు ప్రాజెక్టు సమీపంలో చేపల ఉత్పత్తి కేంద్రంలో జా తీయ 24వ ఫిషర్స్ డేను నిర్వహించారు. చేపల పెంపకందారులు సంఘటితంగా ఉంటే మత్స్య సంపద పెరిగి ఆర్థిక వృద్ధి చెందుతారన్నారు. జిల్లా నూతన మత్స్యకారుల సంఘం సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చేపల పెంపకందారులు మాట్లాడుతూ చెరువులను కబ్జా చేసి చేపలను వేరేవారు పట్టుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారుల సంఘాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, మత్స్య శాఖ సిబ్బంది ఆనం నర్సింలు, బో యిన రాజు, బంటు పెంటయ్య, బోయిన అంబదాస్, అంజయ్య, రాజు, శేఖర్, వీరేశం, దుర్గయ్య, బాలయ్య, మునిందర్, మహేశ్, ప్రశాంత్, రంజీత్, హనుమంతు, నర్సింలు పాల్గొన్నారు.

61ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి


ఎమ్మెల్యే పీఏకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పరిగి,జూలై 10: రెవెన్యూ శాఖలో 61ఏళ్లు నిండిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులను నియమించాలని వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి లేకపోవడంతో ఆయన వక్తిగత కార్యదర్శికి సంఘం పరిగి మండల అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణలు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గతంలో విడుదల చేసిన జీవోలు 81, 85 ప్రకారం 61ఏళ్లు నిండిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అర్హతలను బట్టి వీఆర్ఏలు, రికార్డు అసిస్టెంట్లుగా నియమించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వెంకటేశ్, భాస్కర్, రాములు, శ్రీను తదితరులు ఉన్నారు.

పంచాయతీల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు


కొర్విచెడ్‌లో వన నర్సరీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో శంకర్‌నాయక్

బషీరాబాద్, జూలై 10: గ్రామ పంచాయ తీ ల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తాం డూరు డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. బుధ వారం బషీరాబాద్ మం డలం కొర్విచెడ్ గ్రామా న్ని ఎంపీవో రమేష్‌తో కలిసి ఆనయ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని వననర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేసి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. హరిత వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రాంతాలపై ఆరా తీసిన ఆయన ఆదిశగా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలోని పలు వార్డుల్లో కలియతిరిగి డ్రైనేజీ వ్యవస్థను స్వయంగా గుర్తించారు. వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉందని పరిశుభ్రతకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు.

జ్వరంతో బాధపడుతున్న హాస్టల్ విద్యార్థినులు

తాండూరు రూరల్, జూలై 10: జినుగుర్తిలో గల ఎస్టీ బాలికల హాస్టల్‌లోని కొందరు విద్యార్థినులు రెండు రోజులుగా జ్వరం, దురదతో బాధపడుతున్నారు. బుధవారం 9మంది విద్యార్థినులు ఉపాధ్యాయినులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రెండు రోజులుగా జ్వరం, చేతులకు దురదతో బాలికలు బాధపడుతున్నారని హాస్టల్ నిర్వాహకులు తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


కడ్తాల : విద్యార్థుల బోధనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న వెంకటయ్య

కడ్తాల్/ఆమనగల్లు, జూలై 10: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య అన్నారు. కడ్తాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, ఆమనగల్లు గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం ఏటీడీవో వెంకటయ్య తనిఖీ చేశారు. ఆయా చోట్ల రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను, పరిసరాలను, గదులను, మరుగు దొడ్లు, మూత్రశాలలను, విద్యార్థులకు సిద్ధం చేసిన వంటకాలను, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్‌డబ్ల్యూవోలు రాములు, రామచంద్రయ్యలకు సూచించారు. విద్యార్థులకు బెడ్‌షీట్స్, కార్పెట్లు, దుస్తులు, నోట్‌బుక్స్ పంపిణీకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమనగల్లు ఎస్టీ హాస్టల్‌లో సంక్షేమ శాఖ అధికారి రామచంద్రయ్య, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌డబ్ల్యూవో రాంచంద్రయ్య, టీచర్లు తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా రామస్వామి, పర్వతాలు



రంగారెడ్డి అర్బన్/శంషాబాద్, జూలై 10 : ఏఐటీయూసీ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా 65 మంది సభ్యులతో కూడిన జిల్లా నూతన కౌన్సిల్‌ను, 21 మంది కార్యవర్గాన్ని, 13 మంది ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేవెళ్లకు చెందిన కె. రామస్వామిని, కార్యద పానుగంటి పర్వతాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు జిల్లా ఉపాధ్యక్షులుగా టి. నర్సింహారెడ్డి, హరిసింగ్ నాయక్, వడ్ల సత్యనారాయణ, కె. చందు యాదవ్, ఎస్ మల్లేష్‌ను నిర్మాణ కౌన్సిల్ ఏకగ్రీంగా ఎన్నికల చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు తెలిపారు.

చల్లా నర్సింహారెడ్డిని కలిసిన వీర్లపల్లి శంకర్


చల్లా నర్సింహారెడ్డికి బొకే అందజేస్తున్న వీర్లపల్లి శంకర్

రంగారెడ్డి అర్బన్, జూలై 10 : తెలంగాణ స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కో-ఆపరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ చల్లా కవిత బాల్‌రెడ్డి, కర్మాన్‌ఘాట్ హనుమాన్ ఆలయం మాజీ డైరెక్టర్ వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్ తదితరులున్నారు.

ప్రజాసేవతో సమాజంలో గుర్తింపు

- జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి


మాట్లాడుతున్న అనితారెడ్డి


మహేశ్వరం, జూలై 10 : రాజకీయంగా పదవులు ఉన్నా, లేకున్నా ఎప్పుడూ ప్రజాసేవలో ఉన్నవారికి సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీగా ఉన్న అనితారెడ్డితో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలను సన్మానించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం అనితారెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ చేయడంలో ఉన్న ఆనందం మరేదాంట్లో ఉండదని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని ఐదు సంవత్సరాలు సేవచేసిన ప్రతీ ప్రజాప్రతినిధిని ప్రజలు ఎప్పుడూ మరిచిపోరన్నారు. ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీవో శైలజారెడ్డి, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మొక్కలు నాటి సంరక్షించాలి

ఇబ్రహీంపట్నం, జూలై 10: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించినప్పుడే ఆశించిన ఫలితాలు రాబడుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నంలోని తట్టిఖానా రోడ్డులోని ఓ వెంచర్‌లో గల పార్కు స్థలంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 700 మొక్కలు నాటుతున్నామని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంరక్షించాలన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. పర్యావరణ హితంకోసం అడవులను కాపాడుకుంటూనే కొత్తగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. తహసీల్దార్ అనిత, చైర్ పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ మంగ, కమిషనర్ రవీందర్ సాగర్, కాంగ్రెస్ నాయకులు ఏదుల్ల పాండురంగారెడ్డి, భూపతిగల్ల మహిపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 10 : ఉస్మానియా యూనివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అమానుషంగా పోలీసులు లాక్కెళ్లడం అప్రజాస్వామికమని, వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు శిగ శంకర్ ఘటనపై స్పందించారు. ఓయూలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవర్ చేసేందుకు వెళ్లిన పాత్రికేయులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. చొక్కా పట్టుకుని లాక్కెళ్లడమే కాకుండా, కెమెరాలను తీయొద్దంటూ బెదిరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.


ధారూరు: నాగసమందర్‌లో బోనాలతో మహిళల ఊరేగింపు

ఘనంగా అమ్మవార్లకు బోనాలు

ధారూరు, జూలై 10: మండల పరిధిలోని నాగసమందర్‌లో బుధవారం పోచమ్మకు బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కులకచర్ల: చౌడాపూర్ మండలం మరికల్‌లో పోచమ్మదేవతకు బోనాలు నిర్వహించారు. గ్రామస్థులు నాయకులు నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, శివకుమార్, నరేందర్, ప్రసాద్, రవి, నర్సింలు, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని ఏర్పుమళ్లలో పోచమ్మకు మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు.


మరికల్‌లో పోచమ్మ ఆలయానికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


ఏర్పుమళ్లలో బోనాలతో తరలుతున్న మహిళలు

నిరంతరం అందుబాటులో ఉంటా

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
- మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, జులై 10: తనను ఎంపీగా గెలిపించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరిస్తానని ఎంపీ ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. బుధవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని పుష్ప కన్వెన్షన్ హాల్‌లో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనను ఎంపీ గా గెలిపించిన ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి అందుబాటులో ఉంటూ బాధ్యతగా చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి అందేలా కృషి చేస్తానని ఈటల భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు తాను ప్రాధాన్యతనిస్తు వారి సమస్యల పరిష్కారానికి కూడా చొరవతీసుకుంటానని భరోసా ఇచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుటకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అంచలంచలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, శామీర్‌పేట మండల బీజేపీ అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ రాష్ట్ర నాయకులు బుద్ది శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు హైమారెడ్డి, దండుగుల మైసయ్య, పవన్‌కుమార్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసేందుకు బీఆర్ఎస్ కుట్ర

- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 10: డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలంటూ దళిత, గిరిజన విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యోగ నియామకాలు అడ్డుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు సాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల మోసపూరిత మాటలు నమ్మి నిరుద్యోగులు, విద్యార్థులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.17.50 కోట్లతో నిర్మించే ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులకు బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత, టీఎస్ఎంఐడీసీ డీఈ రవీందర్‌లతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కసిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల నియామకాలు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతుందని చెప్పారు. విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా ఆధునీకరిస్తూ నూతనభవన నిర్మాణం చేపడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు ఆసుపత్రి అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మరో రూ.10 కోట్లు ఇవ్వడానికి సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. ఆమనగల్లులో పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ విద్యాలయాల ఏర్పాటుకు సీఎం ను కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. డాక్టర్ పరీక్షిత్, డాక్టర్ జయశ్రీ, అర్పనారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంఈవో సర్దార్‌నాయక్, మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, ప్రజాప్రతినిధులు, నాయకులు మెకానిక్‌బాబా, జగన్, కృష్ణానాయక్, సూదిని కొండల్ రెడ్డి, వస్పుల జంగయ్య, మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో ప్రక్షాళన

- సస్పెన్షన్‌కు గురైన అధికారి స్థానంలో శ్యాం కుమార్
- ఒకే సారి వికారాబాద్, ధారూరు రేంజర్‌గా బాధ్యతలు



వికారాబాద్/ధారూరు, జూలై 10: అటవీ శాఖలో ప్రక్షాళన మొదలైంది. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'బోనస్ మింగేశారు' కథనానికి ఎట్టకేలకు అటవీశాఖలో అవినీతికి పాల్పడిన అధికారుల స్థానంలో కొత్త అధికారులు చార్జి తీసుకున్నారు. రెండు రోజుల క్రితం తాండూరు ఎఫ్ఆర్‌వోగా అబ్దుల్ హైసాబ్ బాధ్యతలు స్వీకరించగా, తాజాగా బుధవారం వికారాబాద్, ధారూర్ ఎఫ్ఆర్‌వోగా శ్యాం కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. జూలై 2న వికారాబాద్ ఎఫ్ఆర్‌వో అరుణ, తాండూరు ఎఫ్ఆర్‌వో శ్యాంసుందర్‌లను సస్పెండ్ చేయగా ఉన్నతాధికారుల ఆర్డర్లను రేంజర్లు లెక్క చేయకుండా వ్యవహరించారు. యథావిధిగా విధుల్లో ఉండడం అనంతరం ప్రచురితమైన కథనాలతో అప్రమత్తమైన అటవీ శాఖ ఉన్నతాధికారులు తాండూరు ఎఫ్ఆర్‌వోగా అబ్దుల్ హైసాబ్‌ను, వికారాబాద్, ధారూరు ఎఫ్ఆర్‌వోగా శ్యాంకుమార్‌కు వెంటనే చార్జి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే అధికారులు చార్జిలు తీసుకోవడంతో పాటు సస్పెన్షన్ అయిన అధికారులకు చెక్ పెట్టేశారు. అటవీ శాఖలో జరిగిన అవినీతిపై ఆ ఇద్దరు అధికారుల సస్పెన్షన్ రాష్ట్ర స్థాయిలో చర్చతో వికారాబాద్ జిల్లా అటవీశాఖలో ప్రక్షాళన అవకాశాలు లేక పోలేదనే చర్చ మొదలైంది.


ఉద్దండాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన గుడ్ల సరఫరా

- పది రోజులుగా కొరత
- పర్యవేక్షించని అధికారులు

తాండూరు రూరల్, జూలై 10: తాండూరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పది రోజులుగా గుడ్ల సరఫరా నిలిచిపోయింది. దీంతో టీచర్లు చిన్నారులకు గుడ్లను ఇవ్వడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకే గుడ్ల సరఫరా నిలిచిపోయిందని గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు అంటున్నారు. పోషకాహారం లభించక ఉద్దండాపూర్, మైసమ్మగడ్డ తండాల్లో అంగన్‌వాడీలకొచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఉద్దండాపూర్ అంగన్‌వాడీకి 18 మంది రావాల్సి ఉండగా బుధవారం 10 మందే వచ్చారని టీచర్ భాగ్యలక్ష్మి తెలిపారు. కాగా రాంపూర్ అంగన్‌వాడీ టీచర్, ఆయా రాక తాళం తీసేవారే లేరు. దీంతో చిన్నారులు ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా గుడ్ల సరఫరాపై ఏడీపీవో మాట్లాడుతూ గుడ్లు సరఫరా అయ్యేలా చూస్తామని, అంగన్‌వాడీల్లో సేవలు సరిగ్గా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రేవంత్‌రెడ్డి కుట్రలు చేసినా ప్రజలు ఆదరించారు: ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్ రూరల్, జూలై 10: తనను ఓడించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా ప్రధాని మోదీపై ఉన్న నమ్మకంతో ప్రజలు గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పాలమూరు అభివృద్ధి కోసం పాటు పడుతానని ఎంపీ డీకే అరుణ తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మోదీ ప్రజలు దేశ భద్రత, అభివృద్ధి గురించి ఆలోచన చేశారని, అందువల్లే ఎన్నికల్లో ఎవరు కుట్రలు చేసినా ఫలించలేదని అన్నారు. పాలమూరు, చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల్లో గెలుపునకు బాధ్యత తీసుకున్న సీఎం.. నైతికంగా ఓడిపోయారని తెలిపారు. నాయకులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. తనపై నోటి కొచ్చినట్లు మాట్లాడారని, వెనక్కి తగ్గలేదని, కార్యకర్తలు ధైర్యంగా పోరాడారని తెలిపారు. షాద్‌నగర్‌లో విద్యావంతులు బీజేపీ గెలవాలని అనుకున్నారని, అందువల్లే విజయం సాధ్యమైందన్నారు. తాను గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డియే కారణమన్నారు. పాలమూరు చరిత్రలో పొత్తు లేకుండా మొదటిసారి బీజేపీ గెలిచిందన్నారు. తన గెలుపును ప్రజలకు అంకితమిస్తున్నానని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీరు.. నార్లాపూర్ నుంచి కాకుండా జూరాల నుంచి తీసుకుంటే పాలమూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు మండలాలు సస్యశ్యామల మవుతాయని, సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణానికి చేరుకున్న ఎంపీ అరుణ పరిగి రోడ్డు ప్యారడైజ్ కాలనీ ముందు నుంచి ఫంక్షన్ హాల్‌వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం పలు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అమడాపురం నర్సింహ, అశోక్‌గౌడ్, భూపాలాచారి, చెంది మహేందర్‌రెడ్డి, వెంకటేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్ రూరల్, జూలై 10: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని హిమాయత్ నగర్ గ్రామం ఎస్సీ కాలనీలోని పూడూరు బస్తీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. బస్తీలో ఉండే చిన్నపిల్లలు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే నిత్యం ఆటలాడుతుంటారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


సమావేశంలో పాల్గొన్న బీకేఎస్ నాయకులతో రాజిరెడ్డి

సాగు భూములన్నింటికీ 'రైతు భరోసా' వర్తింపజేయాలి

కడ్తాల్, జూలై 10: రైతుల్లో పెద్ద, చిన్న అనే తేడా చూపకుండా సాగుచేసే భూములన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజిరెడ్డి కోరారు. ఐటీ సాకుగా చూపి రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం ఆపకూడదని సూచించారు. మండలంలోని చల్లంపల్లిలో బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీకేఎస్ దిల్‌సుఖ్ నగర్ భాగ్ అధ్యక్షుడు తీగల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్ గౌడ్, భాగ్ సంయుక్త కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజిరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి పాలక ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. సకాలంలో పెట్టుబడులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకొని నష్టాలకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పిస్తూ జీడీపీని పెంచడంలో రైతాంగం పాత్ర ప్రధానమైందని అభిప్రాయపడ్డారు. జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ మాట్లాడుతూ వ్యవసాయేతర భూములకు, కార్పొరేట్ రైతులకు రైతుభరోసా నుంచి మినహాయించాలన్నారు. బీకేఎస్ నాయకులు చల్ల పవన్ రెడ్డి, గుర్కా అంజయ్య, మల్లేశ్, బొజ్జ రాంరెడ్డి, గుర్కా మహేశ్ యాదవ్, జంగయ్య, కొట్ర రాంరెడ్డి, రామకృష్ణ, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న సాయిచైతన్య

నందిగామ, జూలై 10: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సాయిచైతన్య సూచించారు. మండల పరిధిలోని మొదళ్లగూడ శివారులో గల సింబియాసిస్ యూనివర్సిటీలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, వాటి పర్యవసానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సాయిచైతన్య మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల జరిగే నష్టాన్ని సమాజంపై చూపే ప్రభావాన్ని వివరించారు. మారకద్రవ్యాలు కలిగి ఉన్నా, అమ్మినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదక ద్రవ్యాల పర్యవసానాలపై వీడియో రూపంలో సందేశాలను వీక్షింపజేశారు. కళాశాల డైరెక్టర్ సంతోష్ అగావ్, పోలీస్ ఉన్నతాధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదర్శ కవయిత్రి మొల్లమాంబ


కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్ అర్బన్, జూలై 10: రామాయణాన్ని తెలుగులోకి అనువదించి ఆదర్శప్రాయంగా నిలిచిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబయేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ కుమ్మరి సంఘం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణ ఎదుట ప్రతిష్ఠించిన మొలమాంబ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 16వ శతాబ్దంలోనే రామాయణాన్ని అతి సులభమైన తెలుగు భాషలో అనువదించి గొప్ప కవయిత్రిగా పేరు గడించారని గుర్తు చేశారు. మొల్లను ఆదర్శంగా తీసుకుని సంస్కృతి, సంప్రదాయాలను, పురాణాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అనంతరం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో 301 కలశాలతో తొలి ఆశాఢ బోనాలను పోచమ్మ తల్లికి సమర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికూడ జయంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దయానంద్, షాద్‌నగర్ అధ్యక్షుడు కుమ్మరి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గనూరి విశ్వం, బాబర్‌ఖాన్, జి. బాల్‌రాజ్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

శామీర్‌పేట, జులై 10 : మునిసిపాలిటీ అభివృద్ధికి కౌన్సిలర్లు తోడ్పాటునందించాలని తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు కౌన్సిలర్లలను కోరారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన, కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు వారి వార్డుల్లోని సమస్యలపై చర్చించారు. చేపట్టనున్న అభివృద్ధి పనుల పై పలు తీర్మానాలు చేశారు. త్వరలో జరుపుకోనున్న బోనాల పండగ సందర్భంగా చేపట్టవల్సిన ఏర్పాట్లపై కౌన్సిల్ చర్చించింది. వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు తీర్మానించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఉన్న సమస్యలపై చర్చించారు. మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్లు వన మహోత్సవ కార్యాక్రమాన్ని చేపట్టి మొక్కలను నాటాలని చైర్మన్ వివరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ ఈఈ సునీత, ఆర్ఐ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడకన 'లీకేజీ' పనులు



మొయినాబాద్ రూరల్, జూలై 10: అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి సమస్యలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పనితీరు సక్రమంగా లేదని హిమాయత్ నగర్ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించకపోవడంతో హిమాయత్ నగర్ గ్రామంలో చేపట్టిన పైపులైన్ లీకేజీ మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన, సాయిబాబా దేవాలయం ఎదుట తాగునీటి పైపులైను లీకేజీ అయ్యింది. దాంతో గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. దాంతో స్థానికులు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనాలు ఈ రోడ్డు నుంచే వెళుతుంటాయి.

మొక్కలు నాటి సంరక్షించాలి



మహేశ్వరం : కమిషనర్, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటుతున్న చైర్మన్ మధుమోహన్



యాచారం : తక్కళ్లపల్లితండాలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

● ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, వీర్లపల్లి శంకర్

చేవెళ్ల, జూలై 10 : ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామంలో వనమహోత్సవం నిర్వహించారు. అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని అన్నారు. డీఆర్‌డీవో ఏపీడీ సుభాషిణీ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : తెలంగాణ వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మొక్కలు నాటారు. అలాగే ఎల్కగూడ, గాలిగూడ మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ. 10లక్షలతో వేస్తున్న ఫార్మేషన్ రోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ, వడ్డెర కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి వెంక్యానాయక్, మండలాధ్యక్షుడు రాజు, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డాక్టర్ తబుసమ్, నాయకులు చంద్రశేఖర్, వెంటనర్సింహ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : వన మహోత్సవంలో భాగంగా తుక్కుగూడ మునిసిపాలిటీలోని ఒకటో వార్డులో చైర్మన్ మధుమోహన్.. కమిషనర్ వెంకట్‌రామ్, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని వారు కోరారు.



చౌదరిగూడ : రైతు వేదిక వద్ద మొక్కలు నాటి నీరు పడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

యాచారం : ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి కోరారు. తక్కళ్లపల్లితండా, అయ్యవారిగూడ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తక్కళ్లపల్లితండాలో మొక్కలు నాటారు. మొక్కలు నాటే విధానంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఉపాధిహామీ పథకం ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆమనగల్లు : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా చేపట్టే మొక్కల పెంపకం పై బుధవారం అటవీ శాఖ అధికారులు మండల పరిధిలోని ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో కుసుమ మాధురి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు రకాల మొక్కల పెంపకం , గోతులు తీయడం గురించి వారికి అటవీ శాఖ అధికారి దేవేందర్ వివరించారు. ఈజీఎస్ ఏపీవో మాధవరెడ్డి, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

వనమహోత్సవానికి బదులు హరితహారం?

చౌదరిగూడ : సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టాక హరితహారం పథకం పేరుకు బదులు ప్రభుత్వం వన మహోత్సవం పేరిట కార్యక్రమాలు చేపడుతోంది. అయితే, జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని ఎల్కగూడ పంచాయతీ కార్యదర్శి బుధవారం హరితహారం అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాటే మొక్కలకు రంగులతో రాయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఈ విషయాన్ని ముందే గమనించిన పలువులు నాయకులు కార్యదర్శికి సూచించడంతో హడావుడినా తొలగించారు.

చేవెళ్ల కోర్టు ఏజీపీగా యాదిరెడ్డి



చేవెళ్ల, జూలై 10 : చేవెళ్ల జూనియర్, సీనియర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది బక్కరెడ్డి యాదిరెడ్డి నియామకం అయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏజీపీగా నియమించేందుకు సహకరించిన తోటి న్యాయవాదులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. పదవి మరింత బాధ్యత పెంచిందన్నారు.

కష్టజీవులకు అండగా ఉంటాం

చేవెళ్ల, జూలై 10 : కష్టజీవులకు అండగా నిలబడి వారి పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తెలిపారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో భూ పోరాట సమితి సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి యాజమాన్యాలకు అనుకూలమైన చట్టాలను అమలు చేస్తుందని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులే లేకుండా చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. 16 నెలలుగా పేదవాళ్లు ఇళ్లస్థలాలు లేక గుడిసెలు వేసుకుని నివాసిస్తున్నారని, వారికి ప్రభుత్వం పట్టాలు అందించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణచారి, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహయ కార్యదర్శి మగ్బుల్, తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

మంచాల, జూలై 10 : గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని బీజేపీ లోయపల్లి కన్వీనర్ మోర శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ గ్రామశాఖ అధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీశైలం మాట్లాడుతూ గ్రామంలో మూడేళ్ల క్రితం చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు అసంపూర్తిగా వదిలేసారని, పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బదిలీపై వెళుతున్న ఎస్సైకి సన్మానం

యాచారం, జూలై 10 : ఆపదలో ఉన్న పేద ప్రజలకు సాయం చేస్తే ఎల్లకాలం గుర్తుంచుకుంటారని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ నర్సింహారావు అన్నారు. ఇక్కడి స్టేషన్‌లో విధులు నిర్వహించి ఎల్బీనగర్ సీసీఎస్‌కు బదిలీపై వెలుతున్న ఎస్సై ప్రసాద్‌ను బుధవారం సాయంత్రం సీఐతో పాటు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎస్సై నరేష్‌తో పాటు స్టేషన్ సిబ్బంది ఉన్నారు. ఇక్కడికి మోటకొండూరు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న తేజంరెడ్డి బదిలీ అయ్యారు.

ముడిమ్యాల అటవీ ప్రాంతం సుందరీకరణకు రూ.26 కోట్లు మంజూరు

చేవెళ్ల, జూలై 10 : మండల పరిధిలోని ముడిమ్యాల అటవీ ప్రాంతం సుందరీకరణ కోసం రూ. 26 కోట్ల నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముడిమ్యాల్ అటవీ ప్రాంతం అభివృద్ధికి రూ. 26 కోట్లు మంజూరుకాగా, అటవీశాఖ రూ.13 కోట్లు, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా రూ.13 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ నిధులతో అటవీ ప్రాంతంలోని రోడ్డుకిరువైపులా, లోపల జూపార్కు తరహాలో అభివృద్ధి పనులు చేస్తారని, ఈనెలఖారు వరకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 4లేన్ల రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకులు తొలగిపోయాయన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నం : నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇబ్రహీంపట్నం, జూలై 10: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. కార్మికుల కోర్కెల దినం సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలో కార్మికులు నిరసన తెలిపి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేస్తూ కార్మికుల హక్కులను కాపాడాలని మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.స్వప్న అన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేష్, మండల కన్వీనర్ సీహెచ్.బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : చందన్‌వెల్లి పారిశ్రామికవాడలో కార్మికుల శ్రమను కంపెనీల యాజమాన్యాలు దోచుకుటుంటున్నాయని సీఐటీయూ చందన్‌వెల్లి పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ అల్లి దేవెందర్ అన్నారు. కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లేబర్ కోడ్లన అమలు చేస్తామని ప్రకటించింది. లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల 8 గంటల పని విధానం పోయి 12 గంటలకు చేరుతొందన్నారు. చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో కార్మికులతో యాజమాన్యాలు 12 గంటలు పని చేయిస్తూ అతి తక్కువ వేతనం ఇస్తు వారి శ్రమను దోచుకుంటోందన్నారు. సీఐటీయూ క్లస్టర్ కమిటీ సభ్యులు నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్ అమలు చేసి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య, సీఐటీయూ యాచారం మండల కార్యదర్శి చందూనాయక్‌లు మాట్లాడుతూ కార్మికుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారని, వారికి కేంద్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించి ఉచిత బీమా వసతి కల్పించాలని కోరారు. ఆశావర్కర్లకు పరీక్షలు రద్దు చేసి పారితోషికాలు అందించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అయ్యప్పకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రభావతి, సాలమ్మ, జ.ంగయ్య, లక్ష్మయ్య తదితరులున్నారు.

మొయినాబాద్ రూరల్ : కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు ఆరాటపడుతోందని సీఐటీయూ మొయినాబాద్ మండలాధ్యక్షుడు ముంజగళ్ల ప్రభుదాస్ ఆరోపించారు. మండల పరిధిలోని నాగారెడ్డిగూడలో బుధవారం భవన కార్మికుల దినోత్సవాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకుడు రమేష్, మల్లేష్, తదితరులున్నారు.

కేశంపేట : అంగన్‌వాడీల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి అంగన్‌వాడీ కొత్తపేట, కేశంపేట ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలంటూ తహసీల్దార్ మీర్ అజాంఅలీకి అంగన్‌వాడీ టీచర్లు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకురాల్లు శశికళ, సంతోష, మమత, భాగ్యలక్ష్మి, తదితరులున్నారు.

నందిగామ : కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తించేలా చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బీస సాయిబాబ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూర్ : ఎన్‌హెచ్ఎం స్కీంను రక్షించి, ఆశాలను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా ఆధ్వర్యంలో ఆశాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సాయిబాబా మాట్లాడుతూ ఆశాలను నష్టం కల్గించే ఎగ్జామ్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. ఆశాలు మాధవి, బుజ్జి, చిట్టి, తదితరులున్నారు.

మహేశ్వరం : కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మహేశ్వరం మండల సీఐటీయూ కన్వీనర్ ఏర్పుల శేఖర్ అన్నారు. కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మహేశ్వరంలో ఆశా వర్కర్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శంకర్‌పల్లి/చేవెళ్ల, జూలై 10: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం హెచ్చరించారు. శంకర్‌పల్లిలోని బీడీఎల్ చౌరస్తా వద్ద బుధవారం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, నెంబర్ ప్లేట్ , ట్యాంపరింగ్ చేసినటువంటి 10 వాహనాలను సీజ్ చేశారు. ఎస్సై విఠల్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు. నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలను డ్రైవ్ చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. చేవెళ్ల, శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ పోలీస్‌లతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై విఠల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు, జూలై 10: పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల దారులతో అధికారులు, సిబ్బంది మర్యాద మసలుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్‌ను బుధవారం డీసీపీ తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాల గూర్చి సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేశ్‌లను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బందికి పలుసూచనలు చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు చోటు లేకుండ అన్ని ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని డీసీపీ అధికారులకు సూచించారు. తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామీణ విద్యార్థులకు చేయూత అభినందనీయం

చేవెళ్ల, జూలై 10 : గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి చేయూతనివ్వడం అభినందనీయమని మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ అన్నారు. బుధవారం ఆలూర్ గ్రామానికి చెందిన మంగలి శంకరయ్య, ఆయన కుమారుడు వెంకటేశ్‌లు సొంత డబ్బుతో గ్రామంలో ఉన్న తక్షశిక్ష పాఠశాలలోని విద్యార్థులకు నోటుపుస్తకాలను బాల్‌రాజ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ బాసిత్‌పాషా, సీనియర్ నాయకులు రాంమచంద్రయ్య, దండు నర్సింలు, నయిమ్, బాబా, యూసుఫ్, గోపాల్, తాజోద్దీన్, అజ్జు, మహేశ్, మునీర్‌ఖాన్, సలీం, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ తదితరులు

కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



ఆమనగల్లు, జూలై 10: కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని బుధవారం ఆమనగల్లు మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వగ్గు ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలను మంత్రికి వివరించినట్లు ప్రభాకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని మంత్రి తెలిపినట్లు చెప్పారు. బీజేపీ నాయకులు జటావత్ వెంకటేశ్, మారం వెంకటేశ్, నాగిళ్ల గోవిందు, వినోద్ తదితరులు ఉన్నారు.

కేశంపేట ఎస్సైగా రాజ్‌కుమార్



కేశంపేట, జూలై 10: కేశంపేట నూతన ఎస్ఐగా టి. రాజ్‌కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కుప్పగిరి లింగం బదిలీపై హైదారాబాద్‌లోకి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన టి. రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ప్రజలలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

క్రైం కార్నర్

హైడ్రాలిక్ లిఫ్ట్‌పై నుంచి పడి కార్మికుడు దుర్మరణం

● నందిగామ మండలం నాట్కో పరిశ్రమలో ఘటన

నందిగామ, జూలై 10: నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేకగూడ శివారులో గల నాట్కో పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలై మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన రవిచంద్ర(20) రెండు నెలల నుంచి నాట్కో పరిశ్రమలో క్లీనింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం పరిశ్రమలోని హైడ్రాలిక్ లిఫ్ట్ సహాయంతో శుభ్రం చేయడానికి యత్నిస్తుండగా.. హైడ్రాలిక్ లిఫ్ట్ నుంచి కింద పడడంతో రవిచంద్రకు తీవ్రగాయాలయ్యాయి. నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మరో కార్మికుడు మహేష్‌కు గాయాలుకావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

బోరు మోటార్ల సర్వీస్ వైర్లు అపహరణ

యాచారం, జూలై 10 : వరుస చోరీలతో దొంగలు ఇటు రైతులకు, అటు పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గున్‌గల్‌లో మంగళవారం రాత్రి కృపాకర్‌రెడ్డి, పెంటారెడ్డి, సింహారెడ్డి, కొంగరజంగయ్య, ఆవ మల్లమ్మ, అంజయ్య తదితరులకు చెందిన 15 వ్యవసాయ బోరుమోటార్లకు చెందిన సర్వీస్ వైర్లను దొంగలు అపహరించారు. కాగా, ఆదివారం అర్ధరాత్రి 22 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్‌మోటార్ల సర్వీస్‌వైర్లను చోరీ విషయం మరువకముందే గున్‌గల్‌లో చోరీ జరగడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈమేరకు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ

కేశంపేట, జూలై 10: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీ తాళం ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామి, కాస్త దూరంలో ఉన్న చర్ల మైసమ్మ హుండీలను సైతతం ధ్వంసం చేయడానికి యత్నించారు. కానీ, హుండీలు తెరుచుకోకపోవడంతో వదిలేశారు. బుధవారం ఘటన స్థలాన్ని ఎస్సై రాజ్‌కుమార్ పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలయ పూజారి దిద్యాల బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

కేశంపేట, జూలై 10: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని అత్మహత్యకు పాల్పడిన సంఘటన కేశంపేట మండలం దత్తాయపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యార బాల్‌రాజ్ (58) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడు బాల్‌రాజ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, జూలై 10: శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ తండాలో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. శంషాబాద్ ఎస్సై కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పెద్దషాపూర్ తండాకు చెందిన దబిడే బస్వంత్ బతుకుదెరువు కోసం అదే తండాలో అశోక్ ఫాంహౌస్‌లో భార్య, పిల్లలతో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9న బస్వంత్ ఫాంహౌస్ నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అదేరోజు బస్వంత్ తన స్నేహితుడికి వాట్సాప్ వీడియో కాల్‌చేసి ఫాంహౌస్‌కు దూరంగా ఉన్నానని, వైన్ షాపులో కూర్చున్నట్లు చూపించి ఫాంహౌస్‌కు రాను అని మెసేజ్ పంపించాడు. భార్య మహానంద తన భర్త ఆచూకీ కొరకు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. బుధవారం మహనంద తన భర్త కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి మృతి.. క్వారీ యజమానిపై కేసు

కొందుర్గు, జూలై 10: మండల కేంద్రం శివారులోని కొందుర్గు మినరల్స్ క్రషర్ మిషన్‌లో మంగళవారం కంప్రెసర్ పనులు చేస్తూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై బుధవారం క్వారీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల పరిధిలోని గురిజాల గ్రామానికి చెందిన రూపని రవి(40) కంప్రెసర్ పనులు చేస్తుండగా పక్కనే ఉన్న క్వారీలో కాలు జారిపడి పోవడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు బుధవారం క్వారీ యజమాని జనార్ధన్‌గౌడ్, లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొందుర్గు, జూలై, 10: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆగిర్యాల సబ్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సబ్‌స్టేషన్‌లో గత శనివారం ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మంజూరు చేయించి, ఏర్పాటు చేయించడం జరిగిందని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో మండల పరిధిలోని ఆగిర్యాల, పాత ఆగిర్యాల, ఘటియాతాండ, నాగార్జున హెచరీస్, వెంకిర్యాల, లక్ష్మీదేవునిపల్లి, విశ్వనాథ్‌పూర్, తంగళ్లపల్లి, తిర్మన్‌దేవునిపల్లి, వెంకిర్యాల తాండ గ్రామాల్లోని దాదాపు 1200 బోర్లకు సంబంధించిన రైతులకు ఓవర్ లోడ్ సమస్యతో పాటు విద్యుత్ సమస్య కూడా తీరిందన్నారు. అనంతరం తంగళ్లపల్లి వద్ద 3.8 కోట్ల రూపాయలతో నిర్మాణం చేస్తున్న వంతెన పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా వంతెన నిర్మాణ పనులను త్వరగా చేయించాలని అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, లింగమయ్య గౌడ్, మధుసూదన్‌రెడ్డి, ప్రొటెక్షన్ డిఈ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు



ఆమనగల్లులో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జూలై 10: పీసీసీ సభ్యుడు, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఆమగల్లు, కడ్తాల మండల కేంద్రాల్లో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు తెల్గమల్ల జగన్, బీచ్యనాయక్, వస్పుల మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆమనగల్లు, కడ్తాలలో కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రులలో రోగులకు, బస్టాండ్‌లలో వృద్ధులు, ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు దావ ధనుంజయ్య, చేగూరి వెంకటేశ్, గురిగళ్ల లక్ష్మయ్య, మండ్లీ రాములు, జహంగీర్‌బాబా, గూడూరు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, కృష్ణ, రాంచందర్‌నాయక్, మల్లేశ్‌గౌడ్, కృష్ణనాయక్, ఖాదర్, జవహర్‌లాల్‌నాయక్, మైసయ్య, ఫరీద్, అలీం, మహేశ్,బాబా, సురేశ్ నాయక్, వస్పుల శ్రీశైలం, నాజర్, ఫిరోజ్, శేఖర్, కృష్ణయ్య, గోపాల్, కాలె మల్లయ్య, మల్లేశ్ నాయక్, మంకి శ్రీను, హీరా సింగ్, తులసీరామ్ నాయక్, శంకర్, రాము నాయక్, బాబా, రమేశ్,రఫీ తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

ఆమనగల్లు, జూలై 10: పట్టణంలోని అరబిందో ఉన్నత పాఠశాల కరస్పాండెట్ వర్కాల రమణారెడ్డి మృతిపట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సంతాపం తెలిపారు. బుధవారం ఆమనగల్లులో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బాలాజీసింగ్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

మొయినాబాద్ రూరల్ : నేడు(గురువారం) జోగిన్‌పల్లి భాస్కరరావు ఇంజనీరింగ్ కళాశాలకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ రానున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీసీ కృష్ణామాచారి తెలిపారు. అమ్డాపూర్ చౌరస్తాలోని కళాశాలలో జరిగే 13వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ వేణుగోపాల్, జోగిన్‌పల్లి భాస్కర విద్యాసంస్థల కార్యదర్శి కృష్ణారావు, పీవోజీ చైర్మన్ ప్రొఫెసర్ ఇనాక్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆమనగల్లు : శెట్టిపల్లికి చెందిన పెంటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షురాలు ఎగిరిశెట్టి గోదాదేవి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యంలు పరామర్శించి వ్యక్తిగతంగా రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కొందుర్గు : కొందుర్గు మండల విలేకరుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె కృష్ణయ్య గౌడ్, మండలాధ్యక్షుడిగా ఎండీ వహీద్ అహ్మద్, ఉపాధ్యక్షుడిగా కె.శంకర్‌జీ, ప్రధాన కార్యదర్శిగా పంబళ్ల వెంకటయ్య, కోశాధికారిగా కె.శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కమిటీని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. షాద్‌నగర్ శ్రీ వినాయక గ్యాస్ ఏజెన్సీ యజమాని బి.అశోక్‌రెడ్డి, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : అక్రమ కేసులకు పాల్పడిన వారికి భారీగా శిక్షలు ఉంటాయని స్థానిక ఎస్సైలు జి. శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. జూలై 1నుంచి అమలవుతున్న నూతన చట్టాలపై మండల కేంద్రంలో పోలీసులు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రానికి చెందిన అర్అండ్‌బీ డీఈఈ ఎగిరిశెట్టి దానయ్య(45) మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలో డీఈఈగా పనిచేస్తున్న దానయ్య కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, ఆర్‌అండ్‌బీ శాఖ రాష్ట్ర, వనపర్తి జిల్లా అధికారులు సందర్శించి నివాళులర్పించారు.

షాబాద్ : మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామం మధ్యలో నుంచి ఎర్రోనిగూడకు వెళ్లే నక్షబాటకు దారి ఇవ్వాలని ముద్దెంగూడ గ్రామస్థులు తహసీల్దార్ అన్వర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. పొలాలకు వెళ్లాలంటే నక్షబాట నుంచి వెళ్లాలని, అడ్డంగా కంచె వేశారని గ్రామస్థులు ఆరోపించారు. పక్కదారిలో శ్మశాన వాటిక ఉందని, నక్షబాటకు సమస్యలు లేకుండా చూడాలని కోరారు. గ్రామస్థులు ఎం. నర్సింహులు, బి.సురేష్, కె.వెంకటయ్య, ఎన్.లింగం, పి.నర్సింహులు, కె.సుదర్శన్, బి.వెంకటేష్‌గౌడ్, టి.మల్లయ్య, రాంచంద్రయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఫౌండర్, చాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్ నగర్‌లోని చైతన్య యూనివర్సిటీలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సీడీయూ-ఓపీడీ ఫిజియోథెరపీ క్లినిక్‌ను బుధవారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. టీఎక్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ప్రారంభించారు.

మాడ్గుల : మండల పోలీస్‌స్టేషన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన నాగరాజుగౌడ్‌ను మాడ్గుల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అన్నేపాక జంగయ్య, నాగిళ్ళ మాజీ ఎంటీసీ పొట్టేలు యాదయ్యగౌడ్, రేవంత్ రెడ్డి మిత్రమండలి అధ్యక్షుడు భాస్కర్, అందుగుల కాంగ్రెస్ నాయకులు రాజు, సింగిల్‌విండో డైరెక్టర్ జగన్‌గౌడ్, వెంకటయ్య, యాదయ్య, బషీరుద్దీన్‌లు ఘనంగా సత్కరించారు.

ఆమనగల్లు : ఆమనగల్లు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.వెంకటేశ్‌ను కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంక టేశ్‌ను సత్కరించి అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపు , రోడ్డు ప్రమాదల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజలంత సహకరించాలని ఎస్ఐ కోరారు. వస్పుల మానయ్య, కృష్ణనాయక్, ఖాదర్, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల : మండల కేంద్రంలోని చంద్రారెడ్డి నగర్ కాలనీలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి చంద్రారెడ్డి నగర్ కాలనీలో ఉన్న పోచమ్మ దేవాలయం వరకు పోచమ్మ విగ్రహాన్ని భారీ డప్పుచప్పుళ్లు, డిల్లెం పల్లెంతో ఊరేగింపు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పోచమ్మ విగ్రహం ప్రతిష్ఠించారు. స్థలం, విగ్రహ దాత, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కోరారు. ఆమనగల్లు పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. భవన ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.